వేషగాళ్ళు-మోసగాళ్ళు!!

టెంపోరావ్

విశాలమైన ముందు హాల్లోని సోఫాలో కూర్చొని గోవిందరావు దినపత్రికను చదువుతున్నాడు. టిఫిన్ తిని, కాఫీతాగి దినపత్రికను పూర్తిగా చదవడం అతడి కలవాటు.

అతడి పక్కనుంచి ఎవరో గబగబా వెళ్తున్నారు.

పేపర్ పైనుంచి అతడు చూశాడు. అతడి కొడుకు రమేష్ టెన్నిస్ ఆడ్డానికి వెళ్తున్నాడు!

పద్దెనిమి దేళ్ళ యువకుడు. పచ్చగా, పొడుగ్గా తండ్రి పోలికలో వున్నాడు. హాఫ్ పాంట్ స్పోర్ట్స్ బనియన్, వైట్ కాన్వాస్ షూస్! మెళ్లో ఒంటిపేట బంగారం గొలుసు, చేతికి ఖరీదైన డే అండేట్ సెట్ వాచ్!

ఒక్క గానొక్క కొడుకు! కొడుక్కి ఏం కావలసినా అతను యిస్తూనే వుంటాడు!

అతను మళ్ళా పేపరు చదవడంలో నిమగ్నుడయ్యాడు. కారు దూసుకు పోతున్న చప్పుడు అతడికి వినపడింది. కార్లు నడపడమంటే రమేష్‌కి పిచ్చి ఎక్కువ!

పేజీలు తిప్పి గోవిందరావు వార్తలను చదువుతున్నాడు.

నిమిషాలు దొర్లిపోతున్నాయి. టైమ్ ఎనిమిది దాటింది.

గుమ్మం బయటనుంచి బూట్ల చప్పుడు వినపడింది.

"ఎవరు? కమిన్!" అన్నాడతను.

పోలీస్ సార్జంటులా వున్నాడతను. లోపల కొచ్చి ఎదురుగా నిలబడ్డాడు. అతడికి వినయంగా దణ్ణం పెట్టాడు.

"మీ పేరు విన్నాను సార్! మీ అబ్బాయి రమేష్‌కి యాక్సిడెంట్ అయింది," అన్నాడతను.

పేపర్ని టీపాయిమీదపడేసి గోవిందరావు గాభరాగా సార్జంటు వంక చూశాడు.

"ఏమైంది? రమేష్‌కి దెబ్బలు తగిలేయా?"

"ఆయన క్షేమంగానే వున్నారు. సార్, ఆయన కారు కింద ఒక కుర్రాడు పడ్డాడు. ఆ కుర్రాడిని హాస్పిటల్లో చేర్పించారు. అతడు బతికి పోవచ్చు!"

"మా అబ్బాయి ఎక్కడున్నాడు?"

"పోలీస్ లాకప్‌లో!"

గోవిందరావు అతడివైపు సూటిగా చూశాడు.

"నువ్విక్కడికి ఎందుకొచ్చావు?"

"పోలీసులు ఏదేనా చేసేలోపల తనని రక్షించమని రమేష్ మీతో చెప్పమన్నాడు!"

"నేను మాత్రం ఏం చెయ్యగలను? ఒళ్ళు తెలియనట్లు వాడు కారును పోనిస్తాడు! రాస్కెల్!"

కొడుకుమీద తనలో తలెత్తిన ఆగ్రహాన్ని అతడు ఆపుకోలేకపోయాడు. సార్జంట్ వెనక్కి తిరిగాడు.

"మిస్టర్, మీ సలహా ఏమిటి?" అడిగాడు గోవిందరావు.

"మీరు వెంటనే ఇన్‌స్పెక్టర్ చంద్రన్ గారితో మాట్లాడండి. ఆయన ఇంట్లో వుంటారు! ఆయన తల్చుకుంటే ఏదేనా చెయ్యగలరు!" అన్నాడతను.

"నీ పేరు?"

"సెల్వరాజు, సార్."

గోవిందరావు లోపల కెళ్ళాడు, ప్లాస్టిక్ బాగ్‌తో హాల్లో కొచ్చాడు.

"పద, వెళ్దాం," అన్నాడతను.

గేటు ప్రాంతంలో ఆపిన మోటర్ బైక్ మీద వెళ్తున్న సెల్వరాజు వెనుక డాడ్జి కారును డ్రయివర్ పోనిస్తున్నాడు.

గోవిందరావు మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి రమేష్‌కి లెర్నర్స్ లైసెన్స్ మాత్రం వుంది. ఇది పెద్ద కేసుగా రూపొందుతుంది. మొదట్లోనే తను జాగ్రత్త పడాలి!

మోటర్ బైక్ ఒక కాంపౌండులోకి వెళ్ళి ఆగింది. వెనకనే డాడ్జి కారు ఆగింది. సెల్వరాజు ముందుహాల్లో

కెళ్ళి వెనక్కి తిరిగొచ్చి, "రండి!" అన్నాడు.

గోవిందరావు హాల్లో కెళ్ళాడు. సోఫాలో కూర్చున్న తడికి నమస్కరించాడు.

గోవిందరావు అతడివైపు చూశాడు. సెల్వరాజు బయటకు వెళ్ళిపోయాడు. సోఫాలో వున్నతను లుంగీ, బనియన్‌తో వున్నాడు.

"సార్జంట్ అంతా చెప్పాడు. మీ అబ్బాయికి లైసెన్స్ లేదట!" అన్నాడతను.

"లెర్నర్స్ లైసెన్స్ వుంది! నాకు మీరు సహాయ పడాలి!" అన్నాడు గోవిందరావు.

"అనేకమందికి లంచాలివ్వాలి. కనీసం యిరవై వేలవుతుంది!"

బాగ్‌లోంచి రెండు కట్టలుతీసి గోవిందరావు అతడి కిచ్చాడు.

"ఇరవై వేలు! ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో మీరే ఆలోచించండి! మా అబ్బాయిని వదిలేయాలి! ఈ కేసు కోర్టు కెళ్ళకుండా చూడాలి!"

"ఆల్ రైట్ చూస్తాను. బెంగలేకుండా యింటి కెళ్ళండి!" అన్నాడతను.

అతడు సార్జంటును పిల్చాడు. లోపలకు పరుగెత్తు కొచ్చాడు సెల్వరాజ్.

"సార్జంట్, ఈ కేసును గురించి నే నొచ్చినదాకా ఏమీ రాయొద్దని చెప్పు. నేను పదిహేను నిమిషాల్లో స్టేషన్‌కి వస్తాను" అని సోఫాలోంచి లేచాడతను.

సెల్వరాజ్ శెల్యూట్ చేసి వెళ్ళి పోయాడు. గోవింద రావు నమస్కరించి బయటకు నడిచాడు. కారు

ప్రాంతంలోవున్న సార్జంట్ కి గోవిందరావు ఐదువంద లిచ్చాడు. అతడు కూర్చోగానే డ్రయివర్ కారును పోనిచ్చాడు.

2

పది కావస్తోంది. గోవిందరావు ముందు హాల్లోనే కూర్చున్నాడు. భార్య హాల్లో కొచ్చినా ఆమెతో జరిగిందేదీ అతడు చెప్పలేదు. ఆడవాళ్ళు ఏడ్వడం ప్రారంభిస్తారు!

బుర్రున కారొచ్చి బయట ఆగింది. టెన్నిస్ రాకెట్ పట్టుకుని వుషారుగా రమేష్‌లోపల కొచ్చాడు. తండ్రి ముందు ఆగకుండా లోపలకు వెళ్తున్నాడతను.

అతడు కోపంగా కొడుకుకేసి చూశాడు.

"ఒరేయ్ రమేష్, యిప్పుడు బుద్ధి వచ్చిందా?" అర్చాడతను.

"ఏమిటి డాడీ మీ రనేది?" అడిగాడతను.

"అంతా నీకు తెల్సిందేగా! నేను నలువైపులా డబ్బు విసిరి లాకప్‌నుంచి నిన్ను విడుదల చేయించేనురా! థాంక్సైనా చెప్పకుండా లోపలకు పోతున్నావు!"

"లాకప్ ఏమిటి డాడీ?"

రమేష్ ముఖంలో ఆశ్చర్యం గోచరిస్తోంది. తండ్రి అతడివైపు సూటిగా చూశాడు.

"ఎవడో స్కూలు పిల్లాడు నీ కారుకింద పడ్డాడుటగా?" అన్నాడు గోవిందరావు.

"ఇదంతా ఫన్నీగా వుంది, డాడీ. నేను టెన్నిస్ ఆడి తిన్నగా యిక్కడకొస్తున్నాను. ఎవ్వరూ నా కారుకింద పడలేదు! ఎవరో మీతో అబద్ధాలు చెప్పి

వుంటారు!'' అన్నాడు కొడుకు.

రమేష్‌ని వెళ్ళమని గోవిందరావు ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. ఏదో ఆలోచన తట్టి అతడు బయటకు నడిచాడు. కారులో కూర్చుని తలుపు మూశాడు.

''ఇందాకా వెళ్ళిన యింటికి పద!'' అన్నాడతను.

కారును డ్రయివర్ స్పీడుగా పోనిచ్చాడు. మెయిన్ గేటు మూసివుంది. గేటు సమీపంలో వున్న బోర్డు వంక గోవిందరావు చూశాడు. ''వై. సి. విన్‌సెంట్, డైరెక్టర్, మలబార్ టీ ఎస్టేట్స్ లిమిటెడ్,'' అని బోర్డు మీదుగా వ్రాసి వుంది.

'ఈ యింట్లో పోలీస్ యిన్‌స్పెక్టర్ చంద్రన్ ఎందుకు వున్నాడు' అనుకున్నాడు గోవిందరావు తనలో తాను.

''గేటు తెరిచి కారును లోపలకు పోనీ!'' అన్నాడు డ్రయివర్‌తో.

డ్రయివర్ దిగి గేటు తెరిచాడు. కారును లోపలకు పోనిచ్చి ఆపాడు. బయటకు దిగి గోవిందరావు కాంపౌండ్ నలువైపులా చూశాడు. ఇంత పెద్ద భవనంలో పోలీస్ యిన్‌స్పెక్టర్ వుండలేడు! తన కొడుకు మీదుండే ఆప్యాయత అతడిని గుడ్డివాడిని చేసింది!

గోవిందరావు ముందు గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. పెద్ద తాళం కప్ప అతనికి కనిపించింది! కాన్ఫిడెన్స్ ట్రిక్‌స్టర్స్! వాళ్ళిద్దరూ తనను మోసంచేసి ఇరవై వేల అయిదువందలు తీసుకున్నారు!

గోవిందరావు ఒళ్ళు మండుతోంది. అతడు వెనక్కి తిరిగి గబగబా వెళ్ళి కారులో కూర్చుని తలుపుమూశాడు.

''హోటల్ అశోకాకి పద!'' అన్నాడతను.

3

పడక్కుర్చీలో వెనక్కి బోర్లాబడి డిటెక్టివ్ వాలి కూర్చున్నాడు. చుట్ట పొగ గాలిలో పైకి లేస్తోంది. అసిస్టెంట్ గిరి ఏదో చెప్తున్నాడు. వాలి మౌనంగా వింటున్నాడు.

గుమ్మంలో నిలబడిన వ్యక్తివైపు వాలి సూటిగా చూశాడు. గోవిందరావు! పంచ, పొడగాటి కోటుతో వున్నాడతను. పొట్టిగా కత్తిరించిన క్రాపు, కాళ్ళకు స్లిప్పర్లు వున్నాయి.

"అబ్బాయి, లోపలకు రా!" అన్నాడు వాలి.

గోవిందరావు లోపలకొచ్చి ఎదురుగావున్న సోఫాలో కూర్చున్నాడు.

"వాలిగారూ, ఇటువంటి మోసం యీ పట్నంలో జరగడం యిదే మొదటిసారేమో!" అన్నాడు గోవిందరావు.

"నీకు మొదటిసారి కావచ్చు! ఏం జరిగింది?" అన్నాడు వాలి.

జరిగినదంతా అతను వాలికి వివరంగా చెప్పాడు.

"గోవిందరావు భాయ్, నువ్వు ధనవంతుడవని వాళ్ళకు తెలుసు. ఒక్కగానొక్క కొడుకుమీద నీకు మమకారం ఎక్కువని వాళ్ళు తెల్సుకున్నారు. నీలో భయం సృష్టించారు వాళ్ళు. కొడుకు జైలుపాలవుతాడేమో అని నువ్వు వాడలిపోయావు. నీ బుర్ర ఆలోచించడం మానేసింది. వాళ్ళు ఎంతడిగినా యిచ్చి కొడుకును రక్షించాలి! ఒకే ఆలోచన నీ బుర్రలో నిల్చిపోయింది. దానితో సులభంగా మోసపోయావు!

యాక్సిడెంట్ ఎక్కడైందో, ఇన్‌స్పెక్టర్ చంద్రన్

ఏ పోలీస్ స్టేషన్‌కు చెందినవాడో నువ్వు అడగలేదు! నీ కొడుక్కి లెర్నర్స్ లైసెన్స్ వుందని వాళ్ళు కను క్కున్నారు! నీగురించి కొన్ని విషయాలు తెల్సుకొని వాళ్ళు రంగంలోకి దిగారు,'' అన్నాడు వాలి.

''మీరు చెప్పింది నిజమే, వాలిగారూ. ఆ సమ యంలో నా బుర్ర క్రమబద్ధంగా ఆలోచించలేదు.''

వాలి నవ్వుతూ గిరివైపు చూశాడు.

''గిరీ, మలబార్ టీ ఎస్టేట్స్ లిమిటెడ్ ఆఫీసు నంబరు చూసి ఫోన్ చేసి మాట్లాడు. వై.సి. విన్‌సెంట్ గురించి కనుక్కో!'' అన్నాడు వాలి.

చుట్ట పొగ వదుల్తూ వాలి ఆలోచిస్తున్నాడు.

గిరి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. తనలాంటి పారి శ్రామికవేత్తని అంత సునాయాసంగా మోసగించిన వాళ్ళిద్దర్నీ తొందరగా బంధించి జైల్లో పడేయించాలని గోవిందరావు తాపత్రయపడుతున్నాడు.

''వాలిగారూ, వై. వి. విన్‌సెంట్ రెండు నెలల సెలవుమీద కాశ్మీర్ వెళ్ళారు, సకుటుంబంగా! ఇక్క డున్న అతడి యింటికి వాచ్‌మన్ కాపలాగా వుంటాడని చెప్పారు,'' అన్నాడు గిరి ఫోన్ పెట్టేస్తూ.

వాలి నవ్వుతూ గోవిందరావువైపు చూశాడు.

''అతడు యిన్‌స్పెక్టర్‌గా నటిస్తూ నీతో ముందు హాల్లో మాట్లాడుతున్నప్పుడు వాచ్‌మన్ మహావీర్ ఏమ య్యాడు?'' అన్నాడు వాలి.

''అతడికి ఏదో వాటా వుండొచ్చు, సార్,'' అన్నాడు గోవిందరావు.

వాలి కుర్చీలోంచి లేచాడు.

"నిన్ను మోసగించినట్లే వాళ్ళు అతడినికూడా మోసగించి వుండొచ్చు," అన్నాడు వాలి.

గోవిందరావు అడ్రెసునూ, టెలిఫోన్ నంబర్లనూ రాసుకున్నాడు. గోవిందరావు సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

4

సూర్యకాంతిలో XYZ కారు తళతళ మెరుస్తోంది. వాలి ముందు సీటుమీద కూర్చున్నాడు.

కారు విన్ సెంట్ భవనం ముందు ఆగింది. గేటు మూసి వుంది.

వాలి కిందకు దిగాడు. ఇనప వూచల గేటును లోపలకు తోసి పెద్ద అంగల్లో భవనంవైపు నడవసాగాడు.

చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడ వుంది. నౌకర్లు వుండే క్వార్టర్స్‌లోనుంచి ఒకతను వాలివైపు పరుగెత్తుకొచ్చాడు. ఖాకీ దుస్తుల్లో వున్నాడతను. అతడు వాలికి వినయంగా నమస్కరించాడు.

నవ్వుతూ వాలి అతడివైపు చూశాడు.

"మహావీర్ నువ్వేనా?" అడిగాడు వాలి.

"నేనే, సార్."

"పొద్దుట ఎనిమిది, తొమ్మిది మధ్య నువ్వు ఎక్కడున్నావు?"

"నేను యిక్కడికొచ్చి పావుగంట అయింది, సార్. పొద్దుటే ఫోన్ కాల్ వచ్చింది. నా భార్యకి పురుడొచ్చిందని చెప్పారు. వెంటనే విల్లివాకం వెళ్ళాను. దొంగనాకొడుకు అబద్ధం చెప్పాడు!" అన్నాడతను.

"ఇంటి తాళం చెవులు నీదగ్గరున్నాయా?"

"లేవు సార్."

"ఫోన్ ఎక్కడుంది?"

"ముందు హాల్లోని కిటికీలో ఫోన్ని వుంచారు. ఇటు వైపునుంచి రిసీవర్ తీసుకొని మాట్లాడొచ్చు," అన్నాడు మహావీర్.

ఇంటిముందుకు వెళ్ళాడు వాలి. వరండామీదకు నడిచాడు. కిటికీలోవున్న ఫోన్ అతడికి కనపడింది. విన్సెంట్ కాశ్మీర్‌లో వున్నాడనీ, విల్లివాకంలో గర్భవతి అయిన మహావీర్ భార్య వుందనీ వాళ్ళు తెల్సుకున్నారు.

గోవిందరావును మోసగించడానికి విన్సెంట్ భవనాన్ని పావుగంటపాటు వాళ్ళు వుపయోగించారు! ఇదంతా ఆలోచిస్తూ వాలి ముంగుగుమ్మం దగ్గరకు వెళ్ళాడు. స్కెలిటన్ కీలో ఆ తాళాన్ని సులువుగా తెరవొచ్చు!

పక్కనే నిలబడిన గిరికేదో ఆంగ్లంలో చెప్పాడు వాలి. వాచ్‌మన్‌ని ఏదో అడుగుతూ గిరి అతడిని దూరంగా తీసుకుపోయాడు. వాచ్‌మన్ని ప్రశ్నిస్తూ గిరి భవనం వెనుకవైపు దారితీశాడు.

స్కెలిటన్ కీతో వాలి తాళాన్ని తెరిచి లోపలకు వెళ్ళాడు. ఫోన్ తిరుగుతోంది. గోవిందరావు పోగానే వాళ్ళిద్దరూ తొందరగా మోటర్‌బైక్‌మీద వెళ్ళిపోయి వుండొచ్చు. ఆన్ చేసిన ఫోన్ని ఆఫ్ చేయడం కూడా వాళ్ళు మర్చిపోయారు!

టీపాయిమీద యాష్ట్రే వుంది. దాన్ని పరీక్షించాడు వాలి. దానిలో రెండు సిగరెట్ పీకలున్నాయి. చార్మి

నార్ సిగరెట్ పీకలు! ఇన్‌స్పెక్టర్ చంద్రంగా నటించి నతను వాటిని కాల్చివుండాలి! సార్జంట్ సెల్వరాజులా నటించేవాడి రాకకోసం ఎదురుచూస్తూ నకిలీ యిన్‌స్పెక్టర్ సోఫాలో కూర్చుని వుండాలి!

సోఫాల అడుగున అన్నివైపులా చూశాడు వాలి. తనకు వుపయోగపడేదేమీ వాళ్ళువదల్లేదు! బయటకొచ్చి వాలి మళ్ళీ తలుపు మూసి తాళం వేశాడు.

వాచ్‌మన్ మహావీర్, గిరి ప్రత్యక్షమయ్యారు. వాలి చుట్ట పీలుస్తూ మళ్ళా మహావీర్ వంక చూశాడు.

“నీకోసం స్నేహితులు యిక్కడకు వస్తూంటారా?” అడిగాడు వాలి.

“ఎక్కువమంది రారు, సార్. వాడుమాత్రం వస్తూంటాడు, లింగరాజు!”

“నీ భార్య పురిటికెళ్ళిందని అతడికి తెలుసా?”

“వాడికన్నీ తెలుసు సార్.”

“అతడిల్లెక్కడ?” అడిగాడతను.

“మీరు వెళ్ళలేరు సార్. పొరంబోకు స్థలంలో గుడిసేసుకుని వుంటున్నాడు.”

“అక్కడకు మమ్మల్ని తీసుకెళ్ళు. కారులోకూర్చో,” అన్నాడు వాలి.

“ఏదేనా దొంగతనం జరిగిందా సార్?” అడిగాడు మహావీర్ గాభరాగా.

అతడివంక సూటిగా చూశాడు వాలి.

“లింగరాజుకి దొంగతనం చేసే అలవాటుందా?” బులెట్‌లా వెలువడింది వాలి ప్రశ్న.

“వాడు మంచివాడు సార్. స్నేహితులకు సిగరెట్లూ అవీ యిస్తూంటాడు.”

ముందు సీటుమీద కూర్చుని వాలి తలుపు మూశాడు. మహావీర్‌ని కారులో ఎక్కించి, గిరి తన సీటుమీదకు జరిగాడు. కారును పోనిచ్చాడు.

చెరువు ఒడ్డున లైనులో ఎన్నో గుడిసెలు వున్నాయి. ఒక గుడిసె ముందు గిరి కారును ఆపాడు. మహావీర్ దిగి లోపలకు వెళ్ళాడు. పొట్టిగా సన్నగా వున్న మరొకడితో అతను తిరిగివచ్చాడు.

వాలి అతడివైపు చూశాడు. లింగరాజు కళ్లు ఎర్రగా వున్నాయి. రమ్ వాసన బయటకు కొడ్తోంది.

"దండాలయ్యా!" అన్నాడు లింగరాజు.

కార్లోంచి దిగాడు వాలి. అతడిముందు నిలబడిన లింగరాజు లిల్లీపుట్‌లా వున్నాడు.

"బాగా రమ్ సేవిస్తున్నట్లున్నావు!" అన్నాడు వాలి.

"నా జీవితం అంతేనయ్యా! బాటిలుంటే గాని నా బుర్ర పనిచేయదు!"

"మహావీర్ పెళ్ళాం పురుడు పోసుకోడానికి విల్లివాకం వెళ్ళిందని నువ్వెవరికి చెప్పావు? ఆలోచించి జవాబియ్యి! ఒక రమ్ బాటిలు నీకొస్తుంది!" అన్నాడు వాలి.

"ఆ మోటర్ సైకిలాడికి చెప్పానయ్యా!"

"ఎవరతను?"

"ఆడిపేరు రామలింగం. వాడి ప్రశ్నలకు సరైన జవాబులిస్తే రెండు రమ్‌బాటిల్సు యిస్తానన్నాడు. విన్సెంట్ కాశ్మీర్‌లో వున్నారని చెప్పాను," లింగరాజు జవాబిచ్చాడు.

"అతడెక్కడుంటాడు?"

"తెలియదయ్యా. ఇక్కడికొచ్చాడు. అంతా తెల్సుకుని రమ్ బాటిల్సుకు డబ్బిచ్చాడు!" అన్నాడతను.

"అతడు మళ్ళా వస్తాడేమో!" అన్నాడు వాలి.

"ఏమో, సార్!"

"వస్తే అతడిని రహస్యంగా వెంటాడు. అతడి యిల్లు ఎక్కడో కనుక్కో! నీకు వందరూపాయిలిస్తాను."

"తప్పక వెంటాడుతాను, సార్."

గిరివైపు వాలి చూపించాడు.

"ఇతను యిక్కడికొస్తాడు. ఏమైనా తెలిస్తే అతడికి చెప్పు!"

"అలాగే, సార్."

జేబులోంచి యిరవైఐదు రూపాయిలు తీసి వాలి అతడికిచ్చాడు.

"నేను తర్వాత యింటికెళ్తానయ్యా," అన్నాడు మహావీర్.

గిరి కారును పోనిచ్చాడు.

వాళ్ళిద్దరికీ ఒక మోటర్ బైక్ వుంది. అంతా తెల్సుకుని వాళ్ళు మోసం చేస్తున్నారు! ప్రస్తుతం యిద్దరు కలిసే యిదంతా చేస్తున్నారని అనుకోవాలి! వాలి మెదడులో ఆలోచనలు చేపల్లా గెంతుతున్నాయి!

5

వరండా మీద నిలబడి ఉష తన భర్తకు బై బై చెప్పింది. స్కూటర్ మీద కూర్చుని, ఆమె వైపు నవ్వుతూ చూస్తూ, అతడు ముందుకు కదిలాడు. స్కూటర్ గేట్లోంచి బయటకు దూసుకు పోయింది.

వీధి తలుపుమూసి ఆమె పడగ్గదిలోకి వెళ్ళింది. దినపత్రికను చూస్తూ పరుపుమీద వెల్లకిలా పడుకుంది.

భర్తతో ఆమె టిఫిన్ తింది. అతడికి భోజనాన్ని కేరియార్‌లో పెట్టి యిచ్చింది. సాయంత్రం ఆరింటికి రామ్‌గోపాల్ వస్తాడు. అంతవరకూ తను ఒంటరిగా కాలం గడపాలి!

రామ్‌గోపాల్, తనూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళయినాక ఆమె బొంబేనుంచి మద్రాస్ వచ్చింది. అన్నానగర్‌లో ఒక ఫ్లాట్ తీసుకుని కాపురం వుంటున్నారు.

పేపర్ని ఆమె కిందపడేసి నిద్రపోయింది. తటాలున ఆమె మేల్కొంది. ఎవరో తలుపును తట్టుతున్నారు. ఆవులిస్తూ ఆమె వెళ్ళి తలుపు తెరిచింది.

పోలీస్ యూనిఫామ్‌లో వున్న వ్యక్తిని చూసి ఆమె వులిక్కిపడింది. అతడు లోపలకు వచ్చాడు.

“మీ పేరు ఉషా?” అడిగాడతను.

ఆమె తలాడించింది.

“నేను ఇన్‌స్పెక్టర్ రాఘవన్ని. మీ భర్తకు యాక్సిడెంట్ అయింది. ఆయన హాస్పిటల్లో వున్నాడు. ఉషా, ఉషా అవి కలవరిస్తున్నారు. మీరు వెంటనే హాస్పిటల్‌కి రావాలి,” అన్నాడతను.

“ఇన్‌స్పెక్టర్, ఎక్కడ యాక్సిడెంట్ అయింది?” అడిగిందామె.

“పాడీ ప్రాంతంలో. ఆయన్ని మేం ఇ.ఎస్.ఐ. హాస్పిటల్లో చేర్చాం అక్కడకి మీరు రావాలి!” అన్నాడతను,

"ఇన్‌స్పెక్టర్, పదండి!" అందామె కంగారుగా.

"వున్న డబ్బు పట్టండి!" అన్నాడతను.

"ఇంట్లో ఎక్కువగా డబ్బులేదు," అందామె.

"హాస్పిటల్లో ఖర్చులకు వుపయోగ పడ్తుందని చెప్పాను" అన్నాడతను.

ఆమె పడగ్గదిలోకి వెళ్ళింది. బొంబేలోవున్న ఆమె తండ్రి రెండువేలకు డ్రాఫ్ట్ పంపాడు. అది కాష్‌చేసి ఆమె ఒక కవర్లో దాచింది. ఏదేనా కొనుక్కో అన్నాడు తండ్రి! ఆమె యింకా ఏమీ కొనుక్కోలేదు. ఆమె ఆ కవర్ను హేండ్ బాగ్‌లో పడేసుకుంది.

పడగ్గదిలోంచి ఆమె ముందు గదిలో కొచ్చింది. ఇద్దరూ బయటకు నడిచారు. ముందు తలుపుమూసి ఆమె తాళం వేసింది. బయటనున్న జీప్‌లో ఆమె కూర్చుంది.

అతడు జీప్‌ను బయటకు పోనిచ్చాడు. జీప్ ముందు ఎవరో సార్జంట్ మోటర్ బైక్ మీద పోతున్నాడు.

జీప్ స్పీడుగా వెళ్తోంది. ఆమె అతడి ప్రక్కనే మౌనంగా కూర్చుంది. అతడు జీప్‌ని ఆపాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. జేబురూమాల్ను ఆమె ముక్కు మీద అదిమి పెట్టాడు.

ఉష సీటుమీద వెనక్కి వాలి కళ్ళు మూసింది. అతడు ఆమె వంటిమీదున్న నగల్ను తీసుకున్నాడు. ఆమె చేతిలోవున్న రెండువేలును అతడు తీసుకున్నాడు. ఆమెను దింపి రోడ్డు వారగా పడేశాడతను.

జీప్ శరవేగంగా వెళ్ళిపోయింది!

6

పడక కుర్చీలో కూర్చున్న వాలి టెలిఫోన్ రిసీవర్ని యెత్తాడు.

"హలో, వాలి స్పీకింగ్?" అన్నాడతను.

"వాలి గారూ, నేను ఇన్‌స్పెక్టర్ రామన్ని!" అన్నాడతను.

"రామన్ బాయ్, ఏమిటి సంగతి?" అడిగాడు వాలి.

"రోడ్డు వారగా పడున్న ఒక యువతి మాకు దొరికింది. ఆమెను రాయపేట హాస్పిటల్లో చేర్చాం. మీరు వెంటనే ఇక్కడకు రండి!" అన్నాడతను.

"వస్తున్నాను," అన్నాడు వాలి.

వాలి XYZ కారును శరవేగంగా పోనిచ్చాడు. రాయపేట హాస్పిటల్ కాంపౌండులో అతడు కారును ఆపి దిగాడు.

ఇన్‌స్పెక్టర్ రామన్ అతడివైపు వేగంగా వచ్చాడు.

"రండి సార్! ఆమె గదిలోకి వెళ్దాం," అన్నాడు ఇన్‌స్పెక్టర్ రామన్.

వరండా మీద నడిచి వెళ్లాడు వాలి. ఎందరో రోగులు వరండా మీద పడుకుని వున్నారు. ఒక గదిలోకి వాలి ప్రవేశించాడు.

ఉష పరుపుమీద పడుకునివుంది. అతడివైపు విచిత్రంగా చూసింది. ఇన్‌స్పెక్టర్ రామన్ యింతకుముందే డిటెక్టివ్ వాలి వస్తాడని ఆమెతో చెప్పాడు.

"వాలిగారూ?" అంది ఉష.

"అమ్మాయి, ఏమైంది?" అడిగాడు వాలి.

కాస్సేపు ఆమె మాట్లాడ లేదు. బుగ్గమీసాలు నోట్లో చుట్టు!

ఉష అతడివైపు మౌనంగా చూస్తూ వుండిపోయింది.

"అమ్మాయి చెప్పు!" అన్నాడు వాలి.

"వాలి గారూ, నా భర్తకు స్కూటర్ యాక్సిడెంట్ అయిందనీ, అతడు హాస్పిటల్లో వున్నాడనీ చెప్పాడతను. తన పేరు ఇన్‌స్పెక్టర్ రాఘవన్ అన్నాడతను. అతడి జీప్‌లో నేను కూర్చున్నాను, అతడు నాకు స్పృహ లేకుండా చేసి నా నగలన్నీ పట్టుకుపోయాడు. ఆ జీప్ ముందు ఒక సార్జంట్ మోటర్ బైక్ మీద వెళ్ళటం నేను గమనించాను," అందామె.

"అతడు తీసుకున్న నగల విలువ ఎంతుంటుంది?"

"కనీసం ఆరువేలు. అదికాక నా బాగ్‌లోవున్న రెండువేలు అతడు తీసుకుపోయాడు," అందామె.

ఎనిమిది వేలు! వాలి ఆమె కేసి సీరియస్‌గా చూశాడు.

"జీప్ నంబరు చూశావా?"

"గుర్తులేదు, సార్," అందామె.

ఆమె భర్త రామ్‌గోపాల్ గదిలో కొచ్చాడు. అతడిని చూడగానే ఆమె ఏడ్వసాగింది. రామ్‌గోపాల్ పరుపు మీద కూర్చొని ఆమెకు ధైర్యం చెప్పాడు.

"పోయిందేదో పోయింది, డోంట్ బాదర్! మనం క్షేమంగా వున్నామని సంతోషించు" అన్నాడతను.

వాలి వాళ్ళిద్దరి కంకా చూశాడు.

"రామ్, నీకు యాక్సిడెంట్ కాలేదుగా?" అడిగాడు వాలి.

"నో సార్! అంతా హంబగ్! నా భార్యను వాళ్లు మోసగించారు. ఆమె దగ్గరున్నదంతా వూడ్చుకు పోయారు," అన్నాడతను.

"వాళ్ళను త్వరలో నేను పట్టుకుంటాను," అన్నాడు వాలి.

"ప్లీజ్, తొందరగా పట్టుకోండి!" అన్నాడు రామ్ గోపాల్.

7

పడక కుర్చీలో కూర్చున్న వాలి రిసీవర్ని యెత్తాడు.

"హలో, వాలి స్పీకింగ్!" అన్నాడతను.

"వాలిగారూ, నేను గోవిందరావుని వాళ్ళను గురించి ఏదేనా తెలిసిందా?" అడిగాడతను.

"గోవిందరావు భాయ్, పరిశోధన సాగిస్తున్నాం. నేరస్థులు శాశ్వతంగా దాక్కోలేరు. ఎప్పుడో అప్పుడు మనకు దొరుకుతారు," అన్నాడు వాలి.

"వాలిగారూ! వాళ్ళను తొందరగా పట్టుకోండి," అన్నాడు గోవిందరావు.

వాలి రిసీవర్ని పెట్టేశాడు. అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇన్స్పెక్టర్ రామన్ గదిలోకొచ్చాడు.

"రామన్ భాయ్, కూర్చో!" అన్నాడు వాలి.

"రామ్‌గోపాల్ తన భార్య ఉషను యింటికి తీసుకు వెళ్ళాడు, సార్! ఆమె నగలను వాళ్ళు అమ్మడానికి ప్రయత్నించ వచ్చు!"

"రామన్ భాయ్, పట్నంలోని నగల షాపులకూ, పాన్ బ్రోకర్లకూ ఆమె నగలను గురించి వివరాలు పంపండి. అటువంటి నగలను ఎవరేనా తెస్తే వెంటనే పోలీస్ రిపోర్ట్ యివ్వమనండి!" అన్నాడు వాలి.

"అలాగే సార్," అన్నాడు ఇన్స్పెక్టర్ రామన్.

8

కాంపౌండులో కారాపి డిటెక్టివ్ వాలి దిగాడు. చుట్ట పీలుస్తూ డాబా యింటివైపు చూశాడు. కొత్తగా కట్టిన యిల్లు. కుడివైపు ఫ్లాట్‌లో ఉష, రామ్‌గోపాల్ వుంటున్నారు.

ఎడం వైపున్న గుమ్మం ముందుకు వెళ్ళాడు వాలి. బూట్ల చప్పుడువిని అరవై ఏళ్ళ స్త్రీ కిటికీలోంచి అతడి వైపు చూసింది. కిటికీ దగ్గర స్టూల్ మీద కూర్చుని ఆమె స్వెట్టర్ అల్లుతోంది.

“ఏం కావాలి, సార్?” అందామె.

నవ్వుతూ వాలి ఆమెకేసి చూశాడు.

“నీతో మాట్లాడాలి,” అన్నాడతను.

“చెప్పండి, మీ మాటలు నాకు వినపడ్తాయి!”

“తలుపు తెరవడానికి భయపడ్తున్నట్లున్నావు!”

“పక్క వాటాలో వుండే అమ్మాయికి జరిగింది విన్నాక తెలిసిన వాళ్ళొస్తేగాని నేను తలుపు తీయ దల్చుకోలేదు!” అందామె.

“మీలా అందరూ జాగ్రత్త పడితే మోసగాళ్ళు పట్నం వదిలి మరో చోటికి పారిపోతారు!”

స్వెట్టర్ అల్లుతూ ఆమె వింటోంది, మాట్లాడుతోంది. పచ్చటి వ్రేలు అతడికి కనిపిస్తోంది. అతడు కిటికీదగ్గరగా జరిగాడు. ఆమె అతడివైపు సూటిగా చూసింది.

వేగంగా వెళ్ళి తలుపు తెరిచింది. గుమ్మం బయట కొచ్చి అతడి వంక చూసింది.

“వాలిగారూ, క్షమించండి! హాస్పిటల్‌కి మీరొచ్చారని ఉష చెప్పింది. లోపలకురండి!” అందామె.

హాల్లోకి వెళ్ళాడు వాలి. హాలు నీట్‌గా వుంది. సోఫాలో కూర్చున్నాడు. స్వెటర్ అల్లడం మానేసి ఆమె ఎదురుగా మరో సోఫాలో కూర్చుంది.

"ఉష పోలీస్ జీప్‌లో వెళ్ళడం నువ్వు చూశావా?"

"చూశాను, సార్. పోలీసు యిన్‌స్పెక్టర్ వచ్చి ఆమెనెందుకు తీసుకెళ్తున్నాడా అని సతమతమయ్యాను. ఆమె నాతో ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయింది!"

"జీప్ నంబరు గుర్తుందా?"

"ఆమె చూసుండాలే!"

"ఆమె చూడలేదు. ఆ క్షణంలో భ్రమయుందామె మనస్సు!" అన్నాడు వాలి.

ఆమె వాలికి ఒక నెంబరు చెప్పింది.

నంబర్ని అతడు గుర్తుంచుకున్నాడు.

ఆమెకు థాంక్స్ చెప్పి బయటకు వెళ్ళాడు.

9

పడక కుర్చీలో కూర్చుని వాలి ఆలోచిస్తున్నారు. గిరి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. రిసీవర్ని పెట్టేసి గిరి మరో నంబర్ తిప్పాడు. సంభాషణ ముగించి గిరి, వాలి పక్కకొచ్చాడు.

"వాలిగారూ, ఆ జీప్ నంబర్ బీడి ఫ్యాక్టరీది," అన్నాడు గిరి.

"దాన్ని ఎవరో దొంగిలించారా?" అడిగాడు వాలి.

"పొద్దుట ఎనిమిదింటికి దొంగిలించారట. వాళ్ళు పోలీసు రిపోర్టిచ్చారు," అన్నాడు గిరి.

వాలి ఆలోచిస్తున్నాడు. కారుముందు సార్జంట్

మోటర్ బైక్ మీద వెళ్ళడం ఉష చూసింది. జీప్‌ను ఎక్కడో వదిలేసి మోటర్ బైక్ మీద వాళ్ళిద్దరూ పోయి వుంటారు!

టెలిఫోన్ మ్రోగింది. గిరి రిసీవర్ని తీశాడు.

"మీకోసం!" అన్నాడు గిరి.

వాలి రిసీవర్ని అందుకున్నాడు.

"వాలి స్పీకింగ్!"

"ఇన్‌స్పెక్టర్ రామన్ని సార్. ఉషను అతడు తీసు కెళ్ళిన జీప్ అరగంట క్రితం పోలీసులకు దొరికింది. స్టీరింగ్ మీద వేలి ముద్రలు రుమాల్తో బాగా తుడిచే శారు! ఆ జీప్ ఒక బీడీ కంపెనీదట!" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"జీప్ ఎక్కడ దొరికింది?"

"కల్లీస్ ప్రాంతంలో."

"రామన్ భాయ్, చూద్దాం," అని వాలి రిసీవర్ని పెట్టేశాడు.

10

దిన పత్రికల్లో గోవిందరావుకు, ఉషకు జరిగినదంతా వివరంగా ముద్రించబడింది. రోడ్డు వారగా పడున్న ఉష ఫోటోనూ, హాస్పిటల్లో వాలితో మాట్లాడే సమ యంలో తీసిన ఫోటోనూ పత్రికలు ముద్రించాయి.

ఒక పత్రికావిలేఖరి ఆమెతో యింటర్‌వ్యూ జరి పాడు.

"మద్రాస్‌లాటి పట్నంలో యిటువంటి సంఘటనలు జరగడం శోచనీయం. పోలీసులు మేలుకొని శ్రద్ధ వహించి ఆ మోసగాళ్ళను, దొంగలను పట్టుకోవాలి!" అందామె విలేఖరితో.

ఫిలిం ప్రొడ్యూసర్ వామనరావు పత్రికలను చదివి టీపాయిమీద పడేశాడు. అతడి కూతురు ముస్తాబై హాల్లోకొచ్చి, సోఫా చేతిమీద కూర్చుని తండ్రివంక ఆప్యాయంగా చూసింది.

"నాన్నా కాలేజికి వెళ్తున్నాను. తర్వాత పిక్చర్ ప్రోగ్రామ్! రాత్రి ఆలస్యంగా వస్తాను," అందామె.

"నువ్వు వచ్చినదాకా నేను భోజనం చేయనమ్మా," అన్నాడతను.

రమణి అతడి ముద్దుల బిడ్డ. పెళ్ళయిన యిరవై ఏళ్ళకు ఆమె పుట్టింది. ఆమెకు రెండేళ్ళు వచ్చాక తల్లి మరణించింది. అప్పటినుంచీ ఆమె తండ్రి చేతుల్లోనే పెరిగింది.

"డ్రయివర్ని తీసుకెళ్ళమ్మా!" అన్నాడతను.

డ్రయివరుంటే తనూ, క్లాస్‌మేట్సూ స్వేచ్ఛగా మాట్లాడుకోలేరు.

"డ్రయివర్ వద్దునాన్నా," అందామె.

రమణి ఫియట్ కారులో కూర్చుని తలుపు మూసింది.

వామనరావు సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

పదిహేను నిముషాలు దొర్లిపోయాయి. టెలిఫోన్ మ్రోగింది. వామనరావు లేచి రిసీవర్ని అందుకున్నాడు.

"హాలో! వామనరావు హియర్," అన్నాడతను.

"వామనరావుగారూ, ఇన్‌స్పెక్టర్ టి. డి. రాజా ఫ్రమ్ మౌంట్‌రోడ్ పోలీస్టేషన్ స్పీకింగ్," అంది అటువైపు కంఠం.

"ఇన్‌స్పెక్టర్! ఏమిటి సంగతి?"

"వామనరావుగారూ, మీ అమ్మాయి రమణి పెద్ద ఏక్సిడెంట్ చేసింది. ఆమె నడుపుతున్న ఫియట్ కారు పేవ్‌మెంట్ మీద కెక్కేసి యిద్దరు మనుష్యుల్ని విపరీతంగా గాయపర్చింది. లక్కీగా మీ అమ్మాయికి ఎక్కువగా దెబ్బలు తగల్లేదు."

"ఇన్‌స్పెక్టర్, వెరీ శాడ్ న్యూస్," అన్నాడు వామనరావు విచారంతో కూడిన కంఠంతో.

"మీరు వెంటనే తయారవండి. ఒక కానిస్టేబుల్ని యింటికి పంపుతున్నాను. ఏక్సిడెంట్ జరిగిన స్థలానికి అతను మిమ్మల్ని తీసుకొస్తాడు."

"ఇన్‌స్పెక్టర్, మా అమ్మాయి విషయంలో మీరు సహాయపడాలి. సాధారణంగా ఆమె కారును జాగ్రత్తగా నడుపుతుంది. ఇంత పెద్ద ఏక్సిడెంట్ జరగడం ఆశ్చర్యంగా వుంది."

"యూ ఆర్ రైట్, సార్. ఏదో లారీ ఆమె కారు పక్కనుంచి దూసుకుపోయింది. ఫియట్ కారు అందువలన పేవ్‌మెంట్ మీద కెళ్ళవలసి వచ్చింది. ఇక్కడున్న కొంతమంది ఇదంతా నాకు చెప్పారు. మీరు రండి. వచ్చాక ఏం చెయ్యగలిగిందీ ఆలోచిద్దాం."

థాంక్స్ చెప్పి వామనరావు రిసీవర్ని పెట్టేశాడు. లోపలకి పరుగెత్తాడు. బట్టలు మార్చుకొని తన లెదర్ బాగ్‌లో కొన్ని నోట్ల కట్టలను పడేసుకుని వామనరావు ముందు హాల్లోకొచ్చాడు. క్షణకాలం గోడకు వేళ్ళాడుతున్న తన భార్య ఫోటోవైపు అతడు చూస్తూ వుండిపోయాడు.

"లక్ష్మీ, అమ్మాయి ఏక్సిడెంట్ చేసిందట. దాన్నిం

టికి తీసుకురావడానికి వెళ్తున్నాను. దాన్ని నువ్వు తప్పక కాపాడతావనే విశ్వాసం నాకుంది,'' అన్నాడతను ఫోటోతో.

వామనరావు ముందు వరండామీదకు నడిచాడు. పోలీసు కానిస్టేబుల్ ఎదురయ్యాడు. అతడు గబగబా వెళ్ళి డ్రాయివర్ని కారులో కూర్చున్నాడు. కానిస్టేబుల్ని ముందు సీటుమీద కూర్చోమన్నాడు. డ్రైవర్ తులసింగం కారును బయటకు పోనిచ్చాడు.

11

రోడ్డమ్మట డ్రాయివర్ కారు వేగంగా కదుల్తోంది. కానిస్టేబుల్ ఎలా వెళ్ళవలసిందీ డ్రైవర్ కి చెబుతున్నాడు.

కానిస్టేబుల్ వెనక్కి తిరిగి వామనరావువంక నవ్వుతూ చూశాడు.

''పోలీసు డాక్టరు యింటికెళ్ళి కబురు చెప్పి వెళ్ళిపోదాం,'' అన్నాడు కానిస్టేబుల్.

''ఎక్కడా యిల్లు?''

''దోవలోనే, సార్.''

కారు స్పీడు తగ్గింది. గేటు తెరిచివుంది. కారును లోపలకు పోనీయమన్నాడు కానిస్టేబుల్. కారు గేటువైపు వెళ్తోండగా ఏదో బోర్డును చూశాడు వామనరావు.

''పోలీస్ డాక్టర్ పేరేమిటి?'' అడిగాడతను.

''రాజన్, సార్!''

తను చూసిన బోర్డుమీద రాజన్ పేరులేదు. వామనరావు మెదడులో అనుమానం మొలకెత్తింది. ఎన్నో క్రైమ్ చిత్రాలు అతడు నిర్మించాడు!

చేతిలోవున్న బాగ్‌ను సీటులోపలకు నెట్టి దాచే శాడు. ఒక భవనంముందు కారు ఆగింది. మోటర్ బైక్ ఒకచోట ఆపబడివుంది.

కానిస్టేబుల్ దిగి లోపలకెళ్లాడు. వామనరావు డ్రయివర్ వీపును తట్టాడు.

"తులసింగం, కారును వెనక్కి తిప్పి పోనీ! క్విక్!" అన్నాడతను.

డాడ్జి కారు వెనక్కి తిరిగింది. కానిస్టేబుల్, మరో కతను బయటకు పరుగెత్తుకొచ్చారు. డాడ్జి కారు గేటు దాటింది. వామనరావు కారు ఆపమని కిందకు దిగాడు. తెరిచివున్న గేటును మూశాడు.

రోడ్డమ్మట వెళ్తూన్న కొందర్ని వామనరావు ఆపాడు. గేటుముందు అందరూ గుంపుగా నిలబడ్డారు.

వామనరావు డ్రయివర్‌తో ఏదో చెప్పి కారును వేగంగా పోనిచ్చాడు. సమీపంలో వున్న మందుల షాపుముందు కారాపి దిగాడతను. లోపలకెళ్ళి హోటల్ అశోకాకి ఫోన్ చేశాడు.

"వాలిగారు కావాలి," అన్నాడతను.

"వాలి స్పీకింగ్!" అంది అటువైపు కంఠం.

"వాలిగారూ, వెంటనే క్రిమ్స్ రోడ్డుకి రండి. ఆ దొంగల్ని ఒక భవనంలో వుంచి గేటు మూసేశాం," అన్నాడతను.

"వస్తున్నా," అన్నాడు వాలి.

డబ్బు చెల్లించి వామనరావు కారులో ఆ బిల్డింగ్ వైపు స్పీడుగా వెళ్ళాడు. గేటుముందు ఇరవై మంది వున్నారు. అంతలో XYZ కారొచ్చి ఆగింది. వామన రావు గేటును తెరిచాడు.

కారును వాలి వేగంగా లోపలకు పోనిచ్చాడు. సమీపంలో మోటర్ బైక్ వుంది. చుట్టూ పీలుస్తూ వాలి కిందకు దిగాడు. వామనరావు పరుగెత్తుకొచ్చి అతడికి నమస్కారించాడు.

"వాలిగారూ, వాళ్ళిద్దరూ ఎక్కడో దాక్కొని వుంటారు," అన్నాడు వామనరావు.

వాలి కాంపౌండ్ నలువైపులా చూశాడు. ఇంటి ముందు గుమ్మం తలుపు లాక్ చేసివుంది. వాలి వెనక వైపు పరుగెత్తాడు. ప్రహరీ గోడదాకా వెళ్ళాడు. వెనుక వైపున మరో రోడ్డు ఉంది!

"అబ్బాయి, వాళ్ళు గోడదూకి యిటువైపునుంచి పారిపోయివుండొచ్చు," అన్నాడు వాలి వామన రావుతో.

"అవును సార్!" అన్నాడతను నిరుత్సాహంగా.

"డోంట్ బాదర్! బంగళాలో వాళ్ళు మోటర్ బైక్‌ను వదిలేశారు. అదెవర్దో మనం కనుక్కోవాలి," అన్నాడు వాలి.

వాలి ముందువైపుకు తిరిగివచ్చి మోటర్ బైక్‌ను పరీక్షించాడు. పాతబడిన మోటర్ బైక్!

వామనరావు వైపు చూసాడతను.

"జరిగినదంతా వివరంగా చెప్పు!" అన్నాడు వాలి.

వామనరావు అంతా చెప్పాడు.

"నీ కూతురు ఏ కాలేజిలో చదువుతోంది?" అడిగాడు వాలి.

"గవర్నమెంట్ కాలేజిలో."

వాలి ఎదురుగానున్న యింటి ముందుకెళ్ళాడు.

"ఫోన్ చేసి అమ్మాయి క్షేమంగావుందని తెల్పుకో!" అన్నాడు వాలి.

వామనరావు ఆ ఇంటివాళ్ళ నడిగి కాలేజికి ఫోన్ చేసి మాట్లాడాడు. నవ్వుతూ వాలి ముందుకొచ్చాడు.

"వాళ్ళు క్రూక్స్ సార్. అమ్మాయి క్షేమంగా వుంది. వాళ్ళిద్దరూ నన్నూ, డ్రయివర్నీ ఏదో చేసి నా బాగ్‌లో వున్న డబ్బు తీసుకుని పారిపోయేవారు! గాడ్ మమ్మల్ని సేవ్ చేశాడు," అన్నాడు వామనరావు.

వాలి వెంటనే ఇన్‌స్పెక్టర్ రామన్‌కి ఫోన్ చేసి మోటర్‌సైకిల్ నంబరు చెప్పాడు.

"అది ఎవర్దో నాకు వేగంగా కావాలి!" అన్నాడు వాలి.

"మీరెక్కడున్నారు?"

వాలి అడ్రెస్ యిచ్చి, టెలిఫోన్ నెంబర్ని చెప్పాడు.

"నేను మీకు ఐదు నిముషాల్లో ఫోన్ చేస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆలోచిస్తూ వాలి పచార్లు చేస్తున్నాడు. చుట్టపొగ గాలిలో పైకి లేస్తోంది.

12

గిరి కారును స్పీడుగా పోనిస్తున్నాడు. ప్రక్కన కూర్చున్న వాలి ఏమీ మాట్లాడ్డంలేదు.

కోడంబాకంలోని ఒక రోడ్డు వారగా గిరి కారును ఆపాడు. ఇరువైపులా వున్న రోడ్లను పరికించి, ఎడం వైపుకు కారును తిప్పాడు. ఒక ఇంటి ముందు కారును ఆపాడు.

వాలి కిందకు దిగాడు. ఇంటి నంబర్ను చూసాడు. ముందుతలుపు మూసివుంది. రెండు మెట్లెక్కి తలుపును తట్టాడు వాలి.

తెల్లటి దుస్తుల్లోవున్న ఒక స్త్రీ తలుపు తీసింది. ఆమె వయసు నలభైపైన వుంటుంది.

"రామం వున్నాడా?" అడిగాడు వాలి.

"తిరుపతి వెళ్లాడు" అందామె.

వెంటనే తిరుపతి వెళ్ళి అతనిని పట్టుకోడం అంత సులువైన పనికాదు!

"ఎప్పుడొస్తాడు?"

"తెలియదండి" అందామె.

"అతని మోటర్ సైకిల్ ఏమైంది?"

"ఆ మలయాళీకి అద్దెకిచ్చాడు."

"ఆ మళయాళీ ఎక్కడున్నాడు?"

"రామంకి తెలుసు."

"కాని రామం తిరుపతిలో వున్నాడు. రామం ఎవరికద్దెకిచ్చాడో నాకు అర్జంటుగా కావాలి" అన్నాడు వాలి గంభీరంగా.

వాలి జబర్దస్తీగా లోపలకు వెళ్ళాడు. ఆమె గాభరాగా అతడివైపు చూస్తోంది. గిరి లోపలకు ప్రవేశించాడు.

"రామం గది ఏది?"

ఆమె ఒక గదివైపు చూపించింది. వాలి, గిరి ఆ గది లోకి జొరబడ్డారు.

చిన్నగది. కిటికీతలుపులు మూసివున్నాయి. గది తలుపులను తెరిచాడు. గదిలోకి బాగా సూర్యకాంతి వచ్చింది.

నేలమీద బొంతుంది. సెక్స్ పత్రికలు బొంత పక్కన కుప్పలుగా పడివున్నాయి. గదంతనూ వాలి, గిరి సోదా చేశారు.

గోడమీద పెన్సిల్‌తో ఏదో రాసివుంది. దాన్ని వాలి జాగ్రత్తగా చదివాడు.

“మీనన్, లెట్ బంగళా, మార్కెట్ వీధి, కోడంబాకం,” అని రాసివుంది.

“గిరీ, అక్కడకు వెళ్ళాలి మనం” అన్నాడు వాలి.

ఇద్దరూ బయటకు పరుగెత్తారు. గిరి కారును వేగంగా పోనిచ్చాడు.

“గిరీ, రామం వాళ్ళ గురించి చెప్తాడని వూహించి ఆ యిల్లు విడిచి మీనన్ పారిపోయి వుండొచ్చు!” అన్నాడు వాలి.

కారు రోడ్డమ్మట దూసుకుపోతోంది. మార్కెట్ వీధమ్మట వెళ్ళి ఎర్రటి యింటిముందు కారాగింది. వాలి దిగి యింటివైపు చూశాడు.

పక్క వాటాలోవున్న ఒకతను వాలిముందుకొచ్చాడు.

“ఏం కావాలి, సార్?” అడిగాడతను.

“కుడివైపు వాటాలో వున్నవాళ్ళు!” అన్నాడు వాలి.

“మీనన్, మస్తాన్—వాళ్ళేనా?”

“వాళ్ళే!” అన్నాడు వాలి.

“రెండు పెట్టెలు పట్టుకుని వాళ్ళు ఇప్పుడే ఆటోలో పోయారు. తాగుబోతులు!” అన్నాడు తను కోపంగా.

“వాళ్ళు వెళ్ళి ఎంత సేపైంది?”

“ఐదు నిమిషాలు కూడా కాలేదు!”

“వాళ్ళు పట్టుకెళ్ళిన పెట్టెలు ఎటువంటివి?”

"ట్రంకు పెట్టెలు సార్! ఒకటి ఎర్ర పెట్టె రెండోది నీలంది."

వాలి వెనక్కి వెళ్ళి కారులో కూర్చున్నాడు. గిరి కారును వెనక్కి తిప్పి పోనిచ్చాడు.

XYZ కారు జట్ విమానంలా దూసుకుపోతోంది. అందరూ వింతగా కారు వైపు చూస్తున్నారు. కొన్ని కార్లు పక్కలకు కదిలి XYZ కారుకు సైడు యిస్తున్నాయి.

మౌంట్ రోడ్డమ్మట పోతోంది కారు. తోవలో కనిపించిన ఆటోలను వాలి పరికిస్తున్నాడు.

ముందు వెళ్తున్న ఆటోని కారు దాటిపోయింది.

"గిరీ మనకు కావల్సింది అదే!" అర్చాడు వాలి.

సడన్ బ్రేక్‌తో గిరి కారును ఆపాడు. కారు వెనకనే ఆటో ఆగింది. వాలి బయటకు దూకాడు. ఆటోలోని వాళ్ళు అతడివైపు భయంతో చూశారు. ఆటోవైపు వాలి కదిలాడు.

మోనన్‌ని యెడమ చేత్తో పట్టుకుని వాలి బలంగా లాగాడు. అతడు కింద పడ్డాడు. మస్తాన్ని కుడిచేత్తో గట్టిగా కొట్టాడు. ఇద్దర్నీ యీడ్చుకెళ్ళి XYZ వెనక సీటుమీద కూర్చోబెట్టారు.

నైలాన్ తాడుతో వాళ్ళ చేతులను వాలి బంధించాడు.

ట్రంకు పెట్టెలను గిరి డిక్కీలో పెట్టాడు. ముందు సీటుమీద కూర్చుని వాలి వాళ్ళిద్దరి వైపు కోపంగా చూశాడు.

గిరి కారును పోనిస్తున్నాడు.

"మమ్మల్ని మీరు అనవసరంగా బంధించారు. మేం చేసిన నేరం ఏమిటి?" అన్నాడు మీనన్.

"పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్ళాక తెలుస్తుంది! గోవిందరావు, ఉష, వామనరావు, వాళ్ళు మిమ్మల్ని గురించి చెప్తారు!" అన్నాడు వాలి గంభీరంగా.

ఆరిపోయిన చుట్టను రోడ్డుమీదకు విసిరి వాలి పాడు గాటి మరో చుట్టను తీసి లైటర్‌తో వెలిగించుకున్నాడు.

XYZ కారు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వైపు దూసుకు పోతోంది.

-: ఐ పో యిం ది :-